క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, రోహిణి హాస్పిటల్, సుబేదారి మెయిన్ రోడ్డు ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కలెక్టరేట్ ప్రాంతంలో ఉదయం 9నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసీ క్యాంప్, నారాయణనగర్, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కళాశాల ఏరియా, హసన్‌పర్తి, రామారం, భీమారం, చింతగట్టు, కోమటిపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఎల్లాపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మౌనిక తెలిపారు.

పెద్ద చెరువు తూము పరిశీలన



మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని పెద్ద చెరువు తూము పూర్తిగా ధ్వంసమైంది. ఈమేరకు తూమును ఇరిగేషన్ డీఈ కృష్ణప్రసాద్ శనివారం పరిశీలించారు. తూముకు మరమ్మతులు చేయిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, ఇరిగేషన్ ఏఈ కిశోర్, యాదగిరి, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

20 నుంచి చెస్ శిబిరం

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 20నుంచి జూన్ 5వ తేదీ వరకు చదరంగ వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ పి.కన్నా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని సర్క్యూట్ హౌస్ రోడ్డులోని కన్నా అకాడమీలో ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. 5నుంచి 15 సంవత్సరాల పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

చెట్ల కొమ్మల తొలగింపు



ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాయిత బ్రాహ్మణ వీధిలో విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ లైన్‌పై కొమ్మలు తొలగించండి అనే శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ డీఈ శంకేశి మల్లికార్జున్ స్పందించారు. ఈమేరకు తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను ఏఈ సంపత్‌కుమార్ సిబ్బందితో తొలగింపజేశారు. కార్యక్రమంలో లైన్ మెన్ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సీలింగ్ ఫ్యాన్ల పంపిణీ



రామన్నపేట: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా ప్రతినిధి డాక్టర్ తాళ్ల రవి తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రామన్నపేటలో నిరుపేదలకు సీలింగ్ ఫ్యాన్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, అప్పరాజు రాజు, మాడిశెట్టి నరహరి, గుండెటి రమణయ్య, దేవా శ్రీనివాస్, పోశాల సురేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన ఇనిగాల బాబు(55) అదృశ్యమైనట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు. ఈనెల 9న సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాబు.. ఇంటికి తిరిగి రాలేదు. దాంతో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాబు కుమారుడు ఉదయభాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 96181 24530, 97001 01044 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

శంభునిపేటలో బాలిక..

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రాంతంలో 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. అమ్మమ్మ ఇంటిలో నిద్రించి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా బాలిక ఆచూకీ లభించలేదు. దాంతో బాలిక తండ్రి గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్దన్ శనివారం తెలిపారు.

ఈటలను కలిసిన నాయకులు

వరంగల్: మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను వరంగల్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ అల్లం నాగరాజు, నాయకులు కలిశారు. శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

తాగుడు.. ఊగుడు

● కుటుంబాలను మరిచిన మద్యం బాబులు



మద్యం మత్తులోకి జారిన వ్యక్తి



తాగి పడిపోయిన మందుబాబు

కాజీపేట: మద్యం తాగడం ఒక దురలవాటు. ఆ మత్తులో వారి పరిస్థితి ఏమిటో వారికే అర్థం కాదు. చుక్క మందు గొంతులో దిగితే ఏం చేస్తారో.. ఎక్కడ పడుకుంటారో స్పృహ ఉండదు. మందు కొట్టగానే మహరాజుల్లాగా ఫీల్ అవుతారు. రోడ్లు, పుట్ పాత్‌లు, డ్రెయినేజీలు, దుకాణాల అరుగులు అన్నీ వారికి పూల పాన్పులే. మద్యం మత్తులో నీరసం ఆవహిస్తుంది. ఆ మైకంలో చెత్తకుప్పలు, మరుగుదొడ్లు, డ్రెయినేజీలు.. అక్కడా ఇక్కడా అనే తేడా తెలియకుండా ఎక్కడైనా ఎంతసేపైనా హాయిగా నిద్రపోతుంటారు. అటువంటి దృశ్యాలే కొన్ని కాజీపేట పట్టణ పరిసర ప్రాంతాల్లో తరచూ దర్శనమిస్తుంటాయి. మందు కొడితే ఎవరి లోకం వారిదే అన్న రీతిలో విర్రవీగే వారు కొందరుంటారు. పట్టణంలో విచ్చలవిడిగా వాడకో బెల్ట్ షాపు నడుస్తోంది. తెల్లవారు జామున 6గంటలకే బార్ అండ్ రెస్టారెంట్లు తెరుచుకుంటుండడంతో మద్యం విచ్చలవిడిగా లభిస్తోంది. దీంతో తాగుబోతుల ఆగడాలు శ్రుతిమిస్తున్నాయని చెప్పొచ్చు.

మీ కోసం ఎదురు చూపులు

మందుబాబులు.. మీ భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు మీ ఇంటి వద్ద మీ రాక కోసం ఆత్రంగా ఎదురుచూస్తుంటారు. మీ రాక ఆలస్యమైతే కంగారుతో మీ ఆచూకీ కోసం పరుగులు పెడతారని మరచిపోవద్దు. జరగరానిది ఏదైనా జరిగితే వారంతా అనాథలవుతారన్న విషయం అనుక్షణం గుర్తుకు తెచ్చుకోండి. మత్తుకు బానిసలై కుటుంబాలను అప్పుల ఊబిలోకి దింపవద్దు. వారిని రోడ్డుపైకి ఈడ్చొద్దు. సామాజిక స్పృహతో మెలిగి హుందాగా బతకడం, సమాజంలో మీ కుటుంబానికి ఓ హుందాతనాన్నిచ్చేలా, మీభార్య బిడ్డలకు తలవంపులు తెచ్చేలా ప్రవర్తించవద్దని పలువురు మానసిక వైద్య నిపుణులతో పాటు ఆదర్శ వాదులు మందుబాబులకు సూచిస్తున్నారు.

కమ్యూనిస్ట్ అమరజీవి రామ సురేందర్



వర్ధంతి సభలో మాట్లాడుతున్న రంగయ్య

కాశిబుగ్గ: చివరి శ్వాస వరకు కమ్యూనిస్ట్‌గా ప్రజాపోరాటాలు చేసిన అమరజీవి కామ్రేడ్ రామ సురేందర్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య కొనియాడారు. ఏసీరెడ్డినగర్‌లోని పార్టీ కార్యాలయంలో రామ సురేందర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ సురేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ రామ సురేందర్ ఎంతో మంది పేదవాళ్లకు శివనగర్‌లో గుడిసెలు వేయించి నివాసం కల్పించారని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధిగా తనకు వచ్చిన నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించారని చెప్పారు. అలాంటి మంచి మనిషి రామ సురేందర్‌ను ఓర్వలేని కొన్ని దుష్టశక్తులు పొట్టపెట్టుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నలిగంటి రత్నమాల, దుర్గయ్య, భవాని, లక్ష్మి, రాధ, సదానందం, అనసూయ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి



అవార్డులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని వాసవీమాత దేవాలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6గంటలకు అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు లలితా సహస్ర పారాయణం, కుంకుమ పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో పెనుగొండ శ్రీవాసవి మాత దర్శనానికి వెళ్లి వచ్చిన 1500 మందికి వాసవి రత్న అవార్డుతో సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ

హసన్‌పర్తి: మండల కేంద్రంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో వాసవిమాత జయంతి వేడుకలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ చేశారు.

వాసవిమాతకు ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని ఆర్యవైశ్య సంఘం భవనంలో శివనగర్ ఆర్యవైశ్య భవనంలో సంఘ అధ్యక్షుడు మంచాల కృష్ణమూర్తి, కార్యదర్శి అంచూరి కిషోర్, వెంకటేశ్వరచారి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మాతకు పూజలు నిర్వహించారు.

విద్యాసంస్థల మోసాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శరత్

ఖిలా వరంగల్: టెక్నో, డీజీ పేర్లతో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న మోసాలను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో శివకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శరత్ మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే గ్రామాల్లో టెక్నో, డీజీ పేర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అనుమతి లేని విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేసి తక్షణమే మూసి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.సంతోషం, అభిరామ్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో ధృవ కళాశాల విజయదుందుభి



విద్యార్థినులను సన్మానిస్తున్న నిర్వాహకులు

వరంగల్: పోచమ్మమైదాన్‌లోని ధృవ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు 2023 -24వ విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని కళాశాల నిర్వాహకులు ఆకుల శ్రీనివాస్, డాక్టర్ ఆకుల సంపత్, సతీష్‌కుమార్ అన్నారు. ఈఏపీసెట్ మెడికల్‌లో నిధిపాల్ 593వ ర్యాంకు, తిరుపతిశ్రీ కందగట్ల 2120, తెహెన్యాత్ ఫాతిమా 2767, ఇంజనీరింగ్ విభాగంలో చీకటి చందన 1024, కొండమడుగుల అలేఖ్య 7777వ ర్యాంకు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా వారిని కళాశాలలో శనివారం సన్మానించారు.

పారిశ్రామికాభివృద్ధిని పట్టించుకోని బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

కాజీపేట: కాజీపేట పరిసర ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా తీరని అన్యాయం చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య విమర్శించారు. కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర కాలనీలో పట్టణ ప్రజా సంక్షేమ పోరాట ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వేపరంగా అదనంగా ఒక ప్రాజెక్టు కూడా రాలేదని విమర్శించారు. ఉన్న కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు యత్నించగా పోరాటాలతో ఉద్యోగులు తమ హక్కులను కాపాడుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎం.చుక్కయ్య అధ్యక్షత వహించగా ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, జె.మురళి, విజయ భాగ్యలక్ష్మి, విమల, సాంబయ్య, సంటి రవి, జస్వంత్ పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో ఆర్‌డీ కళాశాల విజయకేతనం



శరణ్య సాద్విని మహేశ్వరి



జ్ఞానేశ్వరి సమీక్ష

కాజీపేట అర్బన్: ఈఏపీ సెట్ -24 ఫలితాల్లో ఆర్‌డీ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆర్‌డీ కళాశాల ప్రిన్సిపాల్ బండి మల్లేశం, సెక్రటరీ డాక్టర్ కోడూరి రామమూర్తి తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ విద్యార్థులను అభినందించి వారు మాట్లాడారు. ఎన్.మహేశ్వరి 4209వ ర్యాంకు, కే.శరణ్యయ 4477, కే.శ్రీజ 5173, ఎస్.సాద్విని 6989, జ్ఞానేశ్వరి 7031, జి.సమీక్ష 8724వ ర్యాంకు సాధించారని వివరించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



బ్రహ్మంగారి ఆరాధన

హసన్‌పర్తి: ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆరాధన మహోత్సవాలను శనివారం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొన్నాజు రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారెపల్లి రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, మధ్యాహ్నం 12గంటలకు స్వాములవారి ఆరాధన, అనంతరం అన్నప్రసాదాల వితరణ చేశారు. హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి ఆరాధనోత్సవంలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు మారోజు సదానందచారి, జల్లిపెల్లి పెంటయచారి, సలహాదారులు కొక్కొండ శంకరయ్య, గౌరవాధ్యక్షులు రామగిరి సోమలింగయ్యాచారి, శ్రీరామోజు సుందరమూర్తి పాల్గొన్నారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలను కాశిబుగ్గలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ అర్చకుడు శ్రీకాంతాచారి ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు.

‘సఖి’ సేవలపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

కాజీపేట రూరల్: సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని సఖి సెంటర్ కేర్ వర్కర్ హరిత సూచించారు. కాజీపేట దర్గాలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి సేవల గురించి మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ బాధితులకు కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి సేవలను సఖి సెంటర్ కలిపిస్తోందని వివరించారు. సమస్య ఎదురైతే బాధిత మహిళలు 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తక్షణ రక్షణ పొందాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏ, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

మడికొండలో నాంచారమ్మ విగ్రహం లభ్యం



విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సంఘం సభ్యులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో పరికికుంట సమీపంలోని ప్రైవేట్ వెంచర్‌లో పురాతన కాలం నాటి ఎరకల నాంచారమ్మ విగ్రహం శనివారం బయటపడింది. సమాచారం తెలుసుకున్న ఏకలవ్య కుల సంఘం సభ్యులు అక్కడికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, మానుపాటి రమేష్, లోకిని సమ్మయ్య, మడికొండ ఏకలవ్య సంఘం సభ్యులు మానుపాటి సారయ్య, దేవర రమేష్, సారయ్య, మానుపాటి రాజు, రమేష్, లోకిని రవీందర్, రమేష్, సుమలత, లావణ్య, పుష్ప, ప్రేమ్‌కుమార్, సూరయ్య, సమ్మయ్య, సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ సభ్యులకు త్వరలో క్రీడలు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ సాధారణ సభ్యులకు త్వరలో క్రీడలు నిర్వహించాలని ప్రెస్ క్లబ్ కమిటీ నిర్ణయించినట్లు అధ్యక్షుడు వేముల నాగరాజు తెలిపారు. శనివారం నిర్వహించి ఈసీ సమావేశంలో కమిటీ పలు నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమిటీపై పదేపదే దుష్ప్రచారం చేసే సభ్యులపై కఠినంగా వ్యవహరించాలని, నిబంధనలు పాటించని సభ్యుల సభ్యత్వాన్ని తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత కమిటీలో క్లబ్ ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగాలు ఎదుర్కొంటున్న అధ్యక్ష, కార్యదర్శుల ప్రాథమిక సభ్యత్వాలను రద్దు చేస్తూ తీర్మానించినట్లు వివరించారు. సభ్యుల సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తీసుకోడానికి క్లబ్ ఆవరణలో ప్రత్యేక బాక్స్ ఏర్పాటు చేసి, వాటిపై ప్రతి వారం సమీక్ష చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొళ్ల అమర్, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

పిల్లల్లో మానవీయ విలువలు పెంపొందించాలి



సర్టిఫికెట్లతో చిన్నారులు, నిర్వాహకులు

హన్మకొండ చౌరస్తా: ఈర్ష్యా, ద్వేషాలు దరిచేరకుండా పిల్లల్లో మానవీయ విలువలు పెంపొందించాలని తల్లిదండ్రులకు వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ బానోతు సురేష్‌లాల్ సూచించారు. సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ, వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో విద్యార్థులకు శనివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ సురేష్‌లాల్ హాజరై మాట్లాడారు. చిత్రకళతో పిల్లల్లో నేర్చుకోవాలన్న తపన, పట్టుదల, క్రమశిక్షణ అలవడుతుందని వివరించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. త్వరలో జరగబోయే పీస్ ఫెస్టివల్‌లో డ్రాయింగ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్, ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల, నిమ్మల శ్రీనివాస్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వైభవంగా మైసమ్మతల్లి బోనాలు

మడికొండ: మడికొండలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మైసమ్మతల్లి బోనాలను శనివారం నిర్వహించారు. డప్పుసప్పుళ్ల మధ్య మహిళలు, పిల్లాపాపలతో కలిసి బోనాలతో మైసమ్మ తల్లి ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి రాత్రి బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం యాటపోతులతో అమ్మవారికి మొక్కులు సమర్పించనున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మాచర్ల రాజు, డైరెక్టర్లు మునిగాల సదానందం, బుర్ర సతీష్, బైరి రాజు, మొడెం సతీష్, బొల్లికొండ సంపత్, సంఘం సభ్యులు తండ శంకర్, బుర్ర శ్రీధర్, మునిగాల సారంగం, బొల్లికొండ వినోద్, లింగయ్య, స్థానిక నాయకులు, గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చోరీ

ఖిలా వరంగల్: కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల గది తాళాలు ధ్వంసం చేసి గదిలోని 13 ఇనుప బెంచీలు, ఐఎఫ్‌బీ ప్యానల్ అపహరించారు. ఈమేరకు హెచ్‌ఎం మాధవీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

అర్హులను వీసీలుగా నియమించాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీకు పరిశోధన, అకడమిక్, మెరిట్ ఆధారంగా అర్హులైన వారిని వీసీగా నియమించాలని వివిధ యూనివర్సిటీ అధ్యాపకులు కోరారు. ఈమేరకు తెలంగాణ స్టేట్ ఆల్ యూనివర్సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ మామిడాల ఇస్తారి ఆధ్వర్యంలో ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశానికి హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు.

పిల్లల్లో దైవభక్తి పెంపొందించాలి

కాజీపేట: పిల్లలను దేవాలయాలకు తరచూ తీసుకెళ్తూ వారిలో దైవభక్తి పెంపొందించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని శ్వేతార్క మూలగణపతి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో వారం రోజులుగా సుందరకాండ పారాయణం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పాశ్చాత్య మోజులో పడిపోకుండా చూడాలన్నారు. యువతీ, యువకులు ప్రేమ వ్యవహారాల్లో చిక్కుకుని జీవితాలను పాడుచేసుకోవద్దని సూచించారు.

రైల్వే సంఘ్ డివిజన్ ప్రెసిడెంట్‌కు సన్మానం

కాజీపేట రూరల్: కాజీపేట పట్టణానికి చెందిన కొత్త మురళీకృష్ణ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైనట్లు సంఘ్ ఈఎల్ఎస్ బ్రాంచీ చైర్మన్ బి.మాధవరావు శనివారం తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రజాభవన్‌లో మురళీకృష్ణను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎండీ.అంకూస్, గుంటి కుమారస్వామి, రైల్వే సంఘ్ నాయకులు సాధినేని వెంకటనారాయణ, కొత్త మధు కృష్ణ పాల్గొన్నారు.

వెంకట గోపీనాథ్‌కు అభినందన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మైక్రో బయాలజీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట గోపీనాథ్‌ను ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ బాధ్యులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కేయూ అధ్యక్షుడు గుండు సురేష్, బాధ్యులు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ సంపత్ కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

ఇద్దరు జవాన్లపై కేసు

రామన్నపేట: వరంగల్ కార్పొరేషన్‌కు చెందిన రూ.6,200 విలువగల పైపులు ఎత్తుకెళ్లారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లస్వామి ఫిర్యాదు మేరకు శానిటరీ జవాన్లు హుస్సేన్, శ్రావణ్‌పై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. అలాగే, ఈచోరీలో పాల్గొన్న ట్రాక్టర్ డ్రైవర్ గణేష్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీజేపీ ప్రచార వాహనాలు ప్రారంభం



జెండా ఊపి ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్స్ ఎదురుగా ఉన్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కార్యాలయం వద్ద ఎన్నికల ప్రచార రథాలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ ప్రభారీ డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, శ్రీనివాస్, రావు అమరేందర్‌రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి



ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఓట్లు అభ్యర్థిస్తున్న రాకేశ్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకైన తనను శాసనమండలికి పంపాలని, అందుకు పట్టభద్రులు ఆదరించాలని వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి కోరారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో శనివారం మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీ మైదానంలోనూ బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కేయూ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, బాధ్యులు కొమురయ్య, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, యువజన రాష్ట్ర నాయకులు కేయూ బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపించాలని బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ముచ్చర్లలో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సూర ప్రమోద్, శ్రీధర్, రాజేష్, రాజు, సుమన్, శ్రవణ్, బండా సాయిరెడ్డి, శ్రీనివాస్, శ్రవణ్ పాల్గొన్నారు.